

కథా కౌముది

# ప్రజ్ఞానిధి

-పృధ్వి భరద్వాజ్, Dubai, UAE

"శ్రీ పరాభవ" నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
31వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగంలో బహుమతి పొందిన కథ

**విశ్వకిరణ్ తెలివైనవాడు**. తల్లితండ్రులతో ఆరో ఏటనే ఖండాలుదాటి అమెరికా చేరుకున్నాడు. ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కున్నా తనలోని కుతూహలం, చిలిపితనం నిక్షిప్తంగా భద్రపర్చుకున్నాడు. ఇన్‌ఫాక్ట్ హాస్యం, వెటకారం తెలివికొక కొలమానమని నమ్ముతాడు.

చిన్న వయసులోనే "యు ఆర్ అ బాస్టర్డ్, యువర్ మామ్ ఈస్ అ హోర్" అని సహవిద్యార్థులు గ్రౌండ్లో నెట్టేస్తే దెబ్బల్ని తుడుచుకుంటూ "ఎస్ బట్ మై డాడ్ ఈస్ ది ఓన్లీ కస్టమర్" అని సమాధానమిచ్చాడు.

"ఎప్పుడూ ఆలస్యమేనా విశు, కలుసుకుందాం అనుకున్నప్పుడల్లా నేనే నీకంటే ముందోస్తాను" అని శ్రావణి అంటే నీ వెంటపడి అలవాటైపోయింది శత్రు నీవెనకే రావడం అని తప్పించుకున్నాడు.

"పెళ్ళంటే అంత సులువుకాదురా, అటు ఇటు ఏడు తరాలు, జాతకాలు బోల్డు చూడాలి" అని నానమ్మ ఫోన్లో అంటే "అంత ఓపిక లేదు నాని, ఇప్పటికైతే తనతో వెంటనే అరుంధతి నక్షత్రం చూస్తాను" అనేశాడు.

"ఇపుడు రిస్క్ ఎందుకు బావ, మంచి జాబ్ ఉందిగా, కొత్తగా బాబు పుట్టాడు, ఈ బిజినెస్ అవసరమా?" అని తరుణ్ అడిగితే "నేను నా కొడుక్కి ఇవ్వాల్సింది డబ్బు కాదు తరుణ్ ధైర్యం, నేను అనుకున్నది చేయలేకపోతే వాడికి కూడా కలలని చంపుకు బతుకు అని నేర్పినట్టే" అని సముదాయించాడు.

ఏ సందర్భంలో అయినా సరైన మాట అనే గుణం, కరెక్ట్ పని చేసే జ్ఞానం ఉంది తనకు. దాన్నే స్థితప్రజ్ఞత అంటారట, అది ఉన్నవాళ్లే ప్రజ్ఞానిధి అనబడతారట. ఏదో పద్యం చదివి అందులో ఒక పదానికి అర్థం అడిగితే వాళ్ల నాన్న సెలవిచ్చారు.

అలాంటి తనకే ఆ సమయంలో మాటరావట్లేదు. ఆన్‌లైన్‌లో రకరకాల వాదనలు, భాషాప్రయోగాలు భారతీయులమీద వాడుతున్నారు అని తన సహోద్యోగి చార్లీతో అంటుంటే "I can understand Vishwa. Do you want to go home maybe" అన్నాడు. చార్లీ ఎలాంటి దురుద్దేశంతో అనకపోయినా తనేం చెప్పాలో అర్థం కాక ఇంటికొచ్చేశాడు. ఎప్పుడూ లేనిది సాయంకాలమే విస్కీ గ్లాసుతో వెనక పెరట్లో కూర్చునాడు.

ఆశువుగా వంద సినిమాల డైలాగులు గుర్తుండే తనకు ఈరోజు అసలు పదాలే గుర్తురావట్లేదు. తన టీనేజీలో ఆవేశం, ప్రేమ కోసం బోలెడు పద్యాలు రాయగలిగే ప్రేరణనిచ్చిన తెలుగుభాష కూడా తనలోని అంతర్మథనానికి రూపాన్ని ఇవ్వలేకపోతోంది.

వేర్ ఇస్ మై హోమ్?

తన ఉనికి ఏంటి?

తనదంటూ ఒక ప్రదేశం ఉందా ప్రపంచంలో?

ఎక్కడో రాయలసీమలో చిన్న ఊర్లో పుట్టాడు కాబట్టి అదే తన మూలమా? కానీ ఆ వేషభాషలు ఎప్పుడో తన తోటి తెలుగువాళ్లతో ఇమడడానికి మార్చేశాడే. తెలుగు భాషా, భోజనమూ అయితే అది పాన్ ఇండియా సాంగత్యాలతో ఎప్పుడో సంకరమైపోయింది. తన సొంతపిల్లలకు తెలుగు సినిమా హీరోయిన్లకు వచ్చినంత తెలుగు కూడా నేర్పలేకపోయాడు. తిండి కూడా కాస్త కారం తినగానే డామ్ స్పైసీ అంటున్నారు. పోనీ కనీసం ఇండియన్ అనుకోని ఆనందపడదాం అనుకుంటే అక్కడికి వెళ్ళినపుడు ఆలివ్ ఆయిల్ తో చేసిన ఆవకాయలా ఫీల్ అయిన సందర్భాలు కోకొల్లలు. రూపానికి ప్లాస్టిక్ సర్జరీలు చేయించుకున్నట్టు స్వభావానికి ఎన్నో మార్పులుచేర్పులు చేసుకుంటూనే వచ్చాడు. ఎక్కడా ఇమడలేకపోయాడు.

"ఆఫీస్ లో అంత పర్లేదా" అంటూ శ్రావణి వచ్చి కూర్చుంది, చేతిలో గ్లాస్ చూసి. తనది కోపమో ఆందోళనో అర్థంకాక. ఒక వైరాగ్యపు నవ్వు నవ్వాడు. ఇపుడు శ్రావణి ముఖంలో ఒక కుతూహలం. "శర్రు ఇప్పటికిపుడు ఇండియా వెళ్ళిపోదామంటే నువ్వేమంటావ్" అన్నాడు. "ఈ ఆలోచన మందువల్ల వచ్చిందా మొన్న స్వదేశ్ సినిమా ఇరవై ఐదవసారి చూడడం వల్ల వచ్చిందా" అంది. "అబ్బా సీరియస్ గానే అడుగుతున్నా" అంటే ఆలోచించి "నాకు పర్లేదు విశు ఏనాటికైనా వెళ్ళాలనే ఒక ఆలోచన ఎప్పుడూ ఉంటుంది కానీ పిల్లలకు ఇబ్బందేమో" అంది. వాళ్ల గురించి ఆలోచించనే లేదు అనుకుని అదే ప్రశ్న వాళ్లకు వేస్తే? "మీరు ఏంటి? మీ ఐడెంటిటీ ఏంటి? వేర్ ఇస్ యువర్ హోమ్?" నేనే చెప్పలేకపోతే

వాళ్ళేం చెప్తారు? మళ్లీ నవ్వుకున్నాడు. ఆ బాటిల్ దాపెట్టేస్తే ఎప్పటికైనా మంచిదని నిశ్చయించుకొని లోపలికి వెళ్లిపోయింది శ్రావణి.

కాసేపట్లో గట్టిగా ఒక అరుపు వినిపించింది ఇంట్లోనుండి. శ్రావణి ఉన్నట్టుండి లేచి మన అర్జున్ స్కూల్లో ఏదో గొడవట మనం అర్జెంటుగా వెళ్ళాలి అంది. వెన్నెముకలో ఒకసారిగా వణుకు. తన ప్రమేయం లేకుండా పరిగెత్తడం, కార్ తాళాలు తీసుకుని స్కూలుకు వెళ్లడం జరిగిపోయాయి.

స్కూల్ చుట్టూ పోలీస్ కార్లు, మీడియా వ్యాన్లు ముసురుకున్నాయి. ఒక విద్యార్థి గన్ను తీసుకొని తిరుగుతున్నాడట. ఇద్దరు ముగ్గురు చనిపోయారనొక పుకారు. నోట్లో మాట, గొంతులో ఊపిరి ఒకేసారి తడబడి ఇరుక్కుపోయాయి. చుట్టూ సైరెన్ వెలుగులు, తల్లితండ్రుల అరుపులు, శ్రావణి గట్టిగా తన భుజం పట్టుకున్న స్పర్శ, గాల్లో లీలగా టియర్ గ్యాస్ వాసన అన్ని తెలుస్తున్నాయి కానీ జీర్ణం అవట్లేదు. రెండు ఘంటల తర్వాత అంతా సద్దుమణిగింది. మెల్లగా బిక్కుబిక్కుమంటూ బైటికొస్తున్న పిల్లల్లో తన అర్జున్ లేడు. ఒక పక్క చాలామంది పిల్లలు గాయాల్లేకుండా ఒచ్చేస్తుంటే ఊరట, అందులో తన అర్జున్ లేడని ఆందోళన. చివర్లో దీపాంజన్ అని తెలిసిన టీచర్ వచ్చి సారీ కిరణ్ గారు, అర్జున్ కి కొన్ని గాయాలయ్యాయి, హాస్పిటల్ కి పంపాం అనేసరికి ఇద్దరు మోకాళ్లమీద కుదేలపోయారు

మూడువారాలు అవుతుంది అర్జున్ ఇంటికొచ్చి. ఎడతెగని పరామర్శలు, ఎక్కడెక్కడి నుంచో ఫోన్లు. మొదట్లో కాలుచేయి ఆడని శ్రావణికి మెల్లమెల్లగా కాస్త ధైర్యం వచ్చింది. తోడుగా నందిని ఇంట్లోనే ఉంది. తను వాళ్ల ఫ్యామిలీఫ్రెండ్ సురేంద్ర చెల్లెలు. ఎంఎస్ తర్వాత ఒకపక్క జాబ్ వెతుకుతూనే వీసా ప్రయత్నాలు చేస్తోంది. నీ టెన్షన్స్ నీకున్నాయి ఈ బరువు కూడా నీకెందుకు అనంటే పర్లేదు అన్నయ్య, అన్నకి మీరు ఎంత చేయలేదూ అంది. రోజూ రెండోవాడు శర్వాని స్కూల్ నుండి తీసుకురావడం వదిలిపెట్టడం కిరణ్మయి చేస్తోంది. ఎప్పుడో శ్రావణి జాబ్ చేస్తున్నపుడు పరిచయమైన స్నేహితురాలు. మధ్యలో జాబ్ పోతే ధైర్యంగా ఇంటీరియర్ డిజైన్ బోటిక్ నడుపుకుంటోంది. కంపెనీ బాధ్యతలన్నీ చార్లీ చూసుకుంటున్నాడు. అందరూ తలా ఏదోక బాధ్యత నెత్తిన వేసుకుంటున్నారు విశ్వ అడక్కుండానే.

చాలారోజుల తర్వాత అర్జున్ స్కూల్ వెళ్లడం మొదలెట్టాక ఒకరోజు చిన్నపని కోసం ఇంటిదగ్గరి స్టోరుకు వెళ్లాడు విశ్వ. అది నడిపేది మికెల్. షాపులో ఉన్నంతవరకు తననే ముభావంగా చూసాడు. తిరిగిచూస్తే మొహం తిప్పుకునేవాడు. బిల్లింగుకు వచ్చాక బాగున్నావా మికెల్ అంటే ఏదో గొణిగాడు. ఏమైందని అడిగితే వి ఆర్ వెరీ సారీ కిరణ్ అని భోరుమన్నాడు. ఆరాతీస్తే ఆ గన్ను పట్టుకున్న పిల్లాడు తన మేనల్లుడట. శ్లోవాకియా నుంచి వచ్చి స్థిరపడ్డాక తల్లి, తండ్రి చనిపోయారు. బంధువులు, స్నేహితులు దూరంపెట్టేశారు. ఒకడే చదువుకుంటూ తనదగ్గర పనిచేసేవాడు. ఉన్నటుండి ఇలా చేశాడు. 'I don't belong anywhere', నా అనుకునే నలుగురు స్కూల్ ఫ్రెండ్స్ తో వెళ్ళిపోతాను అని రాసుకున్నాడట. విశ్వ అతన్ని ఓదార్చి ఇంటికొచ్చాడు. ఆ పిల్లాడే మదిలో మెదుల్తున్నాడు తనకు. అందరూ ఉన్నందుకు

తను సర్వైవ్ అయ్యాడు ఎవరూలేని ఆ అబ్బాయి అలా అయిపోయాడు. ఆ సంపాదించుకున్న పది మందే తన బలం, తన బలగం.

ఒక ఆదివారం అందర్నీ డిన్నరుకు పిలుద్దాం అనుకున్నారు దంపతులు. అందరూ ఇప్పుడెందుకు మీకు శ్రమ అన్నా తర్వాత ఒక షరతుతో వస్తాం అన్నారు. తలా ఒకచేయి వేసి పనులు చేస్తాం అన్నారు. సురేంద్ర మాత్రం ఒక అదనపు షరతు: కాక్టెయిల్స్ సంగతి నాకు వదిలేయి అన్నాడు. కొన్ని వారాలు ఏదోలా ఉన్న శ్రావణి కూడా చిన్నపిల్లలా కలివిడిగా తిరుగుతోంది. అందరూ తినేసి పెరట్లో చేరారు. విశ్వ ఇదంతా ఒక టీవీ ఎపిసోడ్లా చూస్తునాడు. తన ప్రమేయం లేకుండా అంతా అయిపోతోంది. ఇంతలో నందిని లేచి వీసా అప్రూవ్ అయిందన్న శుభవార్త చెప్పింది. రెండు జాబ్ ఆఫర్స్ ఉన్నాయి కానీ దగ్గర్లో ఉన్న జాబ్ తీసుకుంటానంది. అందరు చప్పట్లు కొట్టేశారు.

తాను గొంతుసవరించుకొని అన్నాడు. “కంగ్రాట్స్ నందిని! స్వీట్స్ నేను తీసుకొస్తాను అన్నప్పుడే నాకు డౌట్ రావాల్సింది“ అన్నాడు అందరి నవ్వుల మధ్య. “సురేంద్ర మీ ‘జలయజ్ఞం‘ కార్యక్రమం అద్భుతం. కిరణ్మయిగారు మిర్చిబజ్జీలతో కన్నీళ్లు తెప్పించిన మీ జలయజ్ఞం మహాద్భుతం! కన్నీళ్లు ఆగిపోయాయి అనుకొనేలోపు దీపాంజన్ బెంగాలీ పాటలతో మళ్లీ తెప్పించారండి. లాస్ట్ టర్న్ మా చార్లీది, తన బార్బిక్యూ పొగలతో”. అందరూ నవ్వేశారు.

“ఎప్పుడు ఎలా మాట్లాడాలో నీ దగ్గరే నేర్చుకోవాలి విశ్వా. స్థితప్రజ్ఞుడివి“ అన్నాడు తన బాల్యమిత్రుడు అజయ్. అందరూ ఊకొట్టారు. విశ్వ ఒక నవ్వు నవ్వి “ఆఫ్ కోర్స్, పొట్టకూటికి చేసే సేల్స్ జాబ్ వల్ల నేర్చుకున్నదే” అన్నాడు.

నవ్వులు సద్దుమణిగాక కాస్త సీరియస్ అయిపోయాడు. “నాలాంటి వాడిక్కూడా మాటలు రాని సందర్భాలు వస్తాయి. కొన్ని వారాలక్రితం ఒక మిత్రుడు ఒకమాట అన్నాడు. ఏదో సందర్భంలో ‘Do you want to go home’ అని. తన ఉద్దేశం మంచిదే. కానీ అది నాలో ఎన్నో ఆలోచనలకి పునాదివేసింది. నా అంటూ నాకోక ప్రదేశం ఉందా? హోమ్ అంటే ఏంటి అని. కానీ అది ఈరోజు మీ అందరివల్ల తెలుసుకున్నాను.....

హోమ్ అంటే ఒక అడ్రెస్ కాదు.

పాస్పోర్ట్ కాదు.

మనల్ని నిలబెట్టేవాళ్లు,

పడిపోతే పట్టుకునేవాళ్ళు ఉండే స్పేస్.

“Home is not where you were born, home is where your Tribe is“

అర్జున్ మెల్లగాలేచి ఈసారి జలయజ్ఞం బాధ్యత మీదా నాన్న అనంగానే అందరూ నవ్వేశారు. చాలా రోజుల తర్వాత మికెల్ కూడా నవ్వాడు.

ఈ కథ జరిగి ఇరవై ఏళ్లు గడిచాయి.

పిల్లలిద్దరూ పెరిగి పెద్దవారైపోయారు, ఉద్యోగాలకోసం వెళ్లిపోయారు. మళ్లీ అర్జున్ పెళ్లికి అందరూ కలిశారు.

విశ్వ తన వాళ్లందర్నీ పిలిచాడు. తన బలగం కూడా పెద్దదైంది. ఐదు సంవత్సరాలక్రితం తను రాసిన 'The atomic reconstruction – My journey through Parfit's portal' గొప్ప పుస్తకంగా న్యూయార్క్ టైమ్స్ పత్రికలో బెస్ట్ సెల్లర్స్ లిస్ట్లో నిలిచింది. తాను చదివిన టెలి ట్రాన్స్‌పోర్టర్ థియరీ ఆధారంగా రాసుకున్న పుస్తకం అది. ఒక మెషిన్లో నిన్ను అణువణువునా విరిచేసి దాన్ని వేరొక ప్రాంతంలోని యంత్రంలో తిరిగి అతికిస్తే ఒక నిమిషంలో ఈ విశ్వంలో ఎక్కడినుంచి ఎక్కడికైనా ప్రయాణం చేసేయొచ్చు. కానీ అలా వెళ్ళిన నువ్వు నువ్వేనా లేక నీ అణువులతో కొత్తగా పుట్టిన మరో వ్యక్తా? తనకు చాలా దగ్గరిగా అనిపించింది ఆ కాన్సెప్ట్. చిన్నవయసులోనే ఎక్కడినుంచో వచ్చిన తను పూర్తిగా ఇక్కడ తయారు చేయబడ్డ వ్యక్తి. కానీ తనలో ఇంకా ఆ తల్లివేర్ల ప్రభావం ఉంటూనే ఉంటుంది. తనలానే కొన్ని లక్షలమంది ఇమ్మిగ్రెంట్స్ ఘోష ఇదే. ఇదే వృత్తాంతంతో తను రాసిన పుస్తకం ఎంతోమందిని కదిలించి తనను దేశంలో చాలా మందికి సుపరిచితుడిని చేసింది. బరాక్ ఒబామా ట్వీట్ వేశారు, జిమ్మీ కిమ్మెల్ షోలో తనను ఇంటర్వ్యూ చేశారు.

అంతటితో ఇది ఆగలేదు. తాను రాసిన పుస్తకం ద్వారా తమ కథని తిరిగి అనుభవం పొందిన కొంతమంది తనను కలిసి 'ది ట్రైబ్ కలెక్టివ్' అనే సంస్థని ప్రారంభించారు. పద్నాలుగు రాష్ట్రాలకు పైగా విస్తరించింది. దేశభాషల, కులమతాల తారతమ్యాలు లేని ఒక సమూహంగా అవతరించింది. తనకథలోని సన్నివేశాల స్ఫూర్తితో ఎన్నో ప్రయత్నాలు కార్యరూపం దాల్చాయి. కొత్తగా వచ్చిన విద్యార్థులకు స్కాలర్షిప్పులు, ట్రైనింగులు, నెట్వర్కింగ్ ఈవెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. దానికి అడ్వైజరుగా నందిని బాధ్యతలు తీసుకుంది. ఉద్యోగాలు, కుటుంబసభ్యులను కోల్పోయిన వాళ్ళు, ఆరోగ్యసమస్యలతో అప్పులపాలైన వాళ్ళకోసం మికెల్ ఆధ్వర్యంలో ఒక కార్యక్రమం నడుపుతున్నారు. మైగ్రేంట్స్ నెలకొల్పే స్టార్టప్స్ కోసం ఒక వెంచర్ కాపిటల్ ఫండ్ ప్రారంభమైంది. ఇలా ఎన్నింటికో నాంది తనలోని అంతర్మథనమని తనకు అంతులేని గర్వము సంతృప్తి.

అలా సంస్థలోని కీలకసభ్యులు, తన బంధువులు, సన్నిహితుల మధ్య తన అబ్బాయి పెళ్లివేడుకలో ఉండగా తన పుస్తక ఎడిటర్ యాస్మిన్ ఫరహాని దగ్గరికి వచ్చి 'Congrats Mr. Kiran on a big milestone' అంది. ఇది ఒక ఘట్టం కాదు ఇదే చివరంకం, ఇంక శేషజీవితం శ్రావణికి సేవలు చేస్తూ తనింట్లో నెలకొల్పిన తెలుగు లైబ్రరీని మెరుగుపరుస్తూ గడిపేస్తాను అని చెప్పబోయాడు విశ్వ. అంతలో తానే 'Ready for the next one?' అంది. ఉన్నట్టుండి వేదిక పక్కనేదో అలజడి. తన మిత్రులు, శ్రేయోభిలాషులు అందరూ కలిసి ఒక పెద్ద బ్యానర్ ని బల్లూన్లతో పైకి ఆవిష్కరించారు. దాని మీద 'విశ్వ కిరణ్ ఫర్ సెనేట్. ఏ లీడర్ ఫర్ ది ట్రైబ్, ఫ్రమ్ ది ట్రైబ్' అని రాసుంది. ఈ ప్రజ్ఞానిధి ప్రతినిధి కాబోతున్నాడు కాబోలు.

విశ్వ తనకేసి చూసాడు, నీకు సమ్మతమేనా అని. నవ్వుతూ తలూపింది శ్రావణి------

★★★★